మహిళలే మహారాణులు



వ్యవసాయ శాఖ మహిళా ఉద్యోగుల సందడి



మహిళా అధ్యాపకులతో ప్రభుత్వ న్యాయవాది సరళాదేవి, క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు



జేసీ డాక్టర్ బి.నవ్యను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (అగ్రికల్చర్): మహిళలు ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూ కుటుంబ పోషణ, పిల్లల పెంపకంలో రాణిస్తుండటం అభినందనీయమని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేసీని మహిళా ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతుల ప్రదానం చేశారు. సీఈఓ విజయ్‌కుమార్, జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, జనరల్ మేనేజర్ పి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): మహిళలు బహుముఖ ప్రజ్ఞావంతులు అని, అందుకే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జేసీ బి.నవ్య పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఏపీజేఏసీ అమరావతి, మానవతా మహిళా విభాగం, ఏపీ రెవెన్యూ అసోసియేషన్, ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేసీ, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసన్న లక్ష్మీ, ప్రభుత్వ ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం మాట్లాడారు. మహిళా ఉద్యోగులు నృత్యాలతో అలరించారు.

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యాన భవన్‌లో మహిళలకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. డీఏఓ పీఎల్ వరలక్ష్మి, మహిళా ఏడీఏలు, అధికారులు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందచేశారు.

● నాబార్డు ఆధ్వర్యంలో బి.క్యాంపులోని బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి నాబార్డు అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. బ్యాంకు మహిళ మేనేజర్లు, టీచర్లను సత్కరించారు.

కర్నూలు సిటీ: ప్రతి మహిళ చదువుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ న్యాయవాది సి.సరళాదేవి అన్నారు. శుక్రవారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకల్లో ఆమె ప్రసంగించారు. క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వి.వి.ఎస్ కుమార్, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డా.అక్తర్‌బాను, వైస్ ప్రిన్సిపల్ వై.ప్రసాద్‌రెడ్డి లింగ సమానత్వంపై మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

● కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యాక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకురాలు ఎస్.ఎన్ పద్మావతి, క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు. సమాజంలో మహిళలు స్ఫూర్తిదాయకంగా నిలవాలని అన్నారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ పీఎస్ షావలి ఖాన్ మాట్లాడారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

● జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సీఐ ఆదిలక్ష్మి, కార్పొరేటర్ పద్మలతా రెడ్డి, హెచ్‌ఎం రాజకుమారి, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క తదితరులు ఝాన్సీ లక్ష్మీబాయ్, మదర్ థెరిసా, సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.



డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మను సన్మానిస్తున్న వీసీ పీఎస్ షా.వలిఖాన్

కించపరచడం మానుకోవాలి



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): మహిళలను కించపరుస్తూ వాణిజ్య ప్రకటనల్లో వ్యాపార వస్తువుగా చూపడం, టీవీ సీరియళ్లలో విలన్లుగా చూపడం మానుకోవాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో ఆమె మాట్లాడుతూ.. మహిళలను గౌరవించేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై దాడులు, హింస, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. చిన్నపిల్లలను చంపి నామరూపాలు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయమని ఆరోపించారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు సిటీ: పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి హెచ్చరించారు. శుక్రవారం కట్టమంచి రామలింగా రెడ్డి మున్సిపల్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సాంఘిక, రాజకీయ సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే మహిళ దినోత్సవ ఉద్దేశమని అన్నారు. విద్యార్థులకు పోక్సో యాక్ట్‌పై అవగహన కల్పించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఏపీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా, హెచ్‌ఎం వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫోరెన్సిక్ కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం



జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఫోరెన్సిక్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో వచ్చే నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న ఫోరెన్సిక్ మెడిసిన్ రాష్ట్రస్థాయి సదస్సుకు శుక్రవారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు నిర్వాహకులు ఆహ్వానం పలికారు. పోలీస్ అధికారులను కలిసిన వారిలో ఏపీఏఎఫ్ఎంటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.సాయి సుధీర్, ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రంగయ్య తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గా పూజ



ప్రత్యేక అలంకరణలో మహాగౌరీ

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం శుక్రవారం మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాల పూజ, దుర్గా పూజ, లలిత సహస్రనామ పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు స్వామిత్వ రీసర్వేపై శిక్షణ

కర్నూలు(అర్బన్): కర్నూలు డివిజన్‌లోని ఏడు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామాల్లో స్వామిత్వ రీసర్వేకు సంబంధించి ఈ నెల 8వ తేదీన స్థానిక జెడ్పీలోని డీపీఆర్‌సీ భవనంలో ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు డివిజనల్ పంచాయతీ అధికారిణి టీ.లక్ష్మి తెలిపారు. గూడురు మండలం చనుగొండ్ల, సి.బెళగల్, కల్లూరు మండలం పర్ల, వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి, కోడుమూరు మండలం ఎర్రదొడ్డి, కర్నూలు మండలం ఈ.తాండ్రపాడు, ఓర్వకల్ మండలం మీదివేముల గ్రామాలు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికయ్యాయని వివరించారు. ఈ గ్రామాల్లో సర్వేయర్‌తో కలిసి రోవర్ ఆపరేషన్, పాయింట్లు పికప్, అసైనింగ్ చల్తా నంబర్: 36 కాలం డేటా సేకరించడం, క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో వెక్టరైజేషన్ తదితర అంశాలపై ఆయా మండలాల్లో పనిచేస్తున్న నలుగురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్లు, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

స్కూల్ సమావేశాలు వాయిదా వేయాలి

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలు మొదలు కానున్న నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వాయిదా వేయాలని యూటీఎఫ్ నాయకులు శుక్రవారం డీఈఓ శ్యామూల్ పాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. డీఈఓ ఆఫీస్ వారు విడుదల చేసిన ఉపాధ్యాయుల పదోన్నతి సీనియారిటీ జాబితాలో జరిగిన పొరపాట్లను సరిచేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఎస్ఎస్‌సీ ఎగ్జామ్ డ్యూటీ నుంచి, మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఎంబీఏ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు సిటీ: ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 5న నిర్వహించిన నేషనల్ మేనేజ్‌మెంట్ మీట్‌లో జి.పుల్లయ్య కళాశాల ఎంబీఏ విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు గెలుపొందారు. శుక్రవారం ఆ కాలేజీలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ గిరిధర్ కుమార్ వారిని అభినందించారు. వారు మాట్లాడు తూ.. ఫైనాన్స్, హెచ్‌ఆర్ యంగ్ మేనేజర్ విభాగంలో మొదటి బహుమతులు, బిజినెస్ క్విజ్ విభాగంలో మొదటి, రెండో బహుమతులు, మార్కెటింగ్ విభాగంలో రెండో బహుమతి కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఇంగ్లిష్ కార్నివాల్ సందడి



నృత్యం చేస్తున్న చిన్నారులు

కర్నూలు సిటీ: స్థానిక మాధవీనగర్, రెవెన్యూ కాలనీలోని సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యా సంస్థల్లో షేక్స్‌పియర్ జయంతి సందర్భంగా శుక్రవారం ఇంగ్లిష్ కార్నివాల్ నిర్వహించారు. ప్రముఖ ఆంగ్ల ఉపన్యాసకురాలు సునీత రోజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చిన్నారులు ఫన్నీ స్క్రిప్ట్, డ్యాన్సులతో పాటు ఇంగ్లిష్‌లో చక్కగా మాట్లాడి ప్రతిభను చాటుకున్నారు. ఆ తరువాత మహిళా దినోత్సవం సందర్భంగా మ్యూజికల్ చైర్స్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విద్యా సంస్థల అధినేత పి.బి.వి సుబ్బయ్య సిబ్బంది పాల్గొన్నారు.

లలితా సుందరేశ్వరీ నమోస్తుతే



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పూజల్లో పాల్గొన్న మహిళలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో లోక కల్యాణార్థం శుక్రవారం లలితా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ మాతా సత్సంగం ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. లలితా దేవిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు. శ్రీమాతా సత్సంగం అధ్యక్షులు శ్రీదేవి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరంగనాథుడికి సింహ వాహన సేవ



సింహ వాహనంపై స్వామి వారు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో వెలసిన గోదాదేవి సమేత రంగనాథస్వామికి శుక్రవారం సింహ వాహన సేవ నిర్వహించారు. స్వామివారు సింహ వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అశ్వవాహన సేవ, తిరుమంగై ఆళ్వార్ దోపిడీ ఉత్సవం జరిగింది. స్వామివార్లకు పవళింపు సేవ నిర్వహించారు. శనివారం శ్రీ పుష్ప యాగ ద్వాదశారాధన, అష్టోత్తర శత కలశ ఉత్సవాన్త స్నపనం, 108 రజత కలశాలచే తిరుమంజనం ధ్వజావరోహణం తదితర కార్యక్రమాలు ఉంటాయని వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగ రాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు వెల్లడించారు.

అధ్వానంగా బీసీ వసతి గృహం

కర్నూలు(అర్బన్): కల్లూరు మండలం పెద్దపాడులో ఉన్న బీసీ బాలుర వసతి గృహం నిర్వహణ అధ్వానంగా ఉందని ఎస్ఎఫ్ఐ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప తదితరులు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి బీకే వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని, క్రమశిక్షణ పేరుతో విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయని, వారానికి ఒకసారి కూరగాయలు తీసుకొచ్చి కుళ్లిన వాటినే వంటలో వాడుతున్నారన్నారు. సరిగా ఉడకని చాలీచాలని అన్నం వడ్డిస్తున్నారని, అడిగిన వారిని వర్కర్లు బూతులు తిడుతున్నారని విద్యార్థులు వాపోయారని చెప్పారు. కనీసం మెనూ ప్రకారం అరటి పండు, గుడ్డు కూడా అందించడం లేదన్నారు. అలాగే హాస్టల్‌లో విద్యార్థులతో పలు రకాల పనులు చేయిస్తున్నారన్నారు. ప్రశ్నించిన విద్యార్థులపై క్రమశిక్షణ పేరుతో దాడులు చేస్తున్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు కూడా లేవని, పాములు, తేళ్లు హాస్టల్‌లోకి వస్తున్నాయని వాపోయారు. విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వార్డెన్, వర్కర్లపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు సాయి, సహాయ కార్యదర్శి అమర్, నాయకులు మల్లేష్, ఖాజా, పృథ్వీ తదితరులు ఉన్నారు.

జనరిక్ మందులపై అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(హాస్పిటల్): జనరిక్ మందులపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎదురుగా ఉన్న జన ఔషధి కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జన ఔషధి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రంలోని మందులను పరిశీలించి పలు మందులను కొనుగోలు చేశారు. జనరిక్ మందులపై ప్రజలు అపోహలు చెందాల్సిన అవసరం లేదని, బ్రాండెడ్ మందుల లాగేనే ఇవి పనిచేస్తాయన్నారు. తక్కువ ధరకే లభిస్తాయన్నారు. పట్టణాల్లోనే గాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ జనరిక్ మందులపై అవగాహన కల్పించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ రమాదేవి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు హరిహరతేజ, పర్వీన్‌బాను పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరం

కర్నూలు(హాస్పిటల్): స్కానింగ్ కేంద్రాల్లో గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. ఆయన శుక్రవారం గాయత్రి హాస్పిటల్‌లోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో రేడియాలజిస్టు లేదా గైనకాలజిస్టు మారితే ఆ వివరాలను ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి అందించాలన్నారు. ఫారం-ఎఫ్‌లు ప్రతి నెలా 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గర్భంలోని శిశువు ఆడ, మగ అనే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదన్నారు.





ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

రంజాన్ నెలలో ముస్లింలు కఠోర ఉపవాసాలు ఉంటున్నారు. నిష్టగా ఖురాన్ గ్రంథాన్ని చదువుతున్నారు. చిత్తశుద్ధితో అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నారు. ప్రతి రోజూ ఐదు పూటలా నమాజ్ చేస్తున్నారు. మసీదుల్లో ఆధ్యాత్మిక చింతనతో గడుపుతున్నారు. మొదటి శుక్రవారం కావడంతో మతపెద్దలు రంజాన్ పవిత్రతను వివరించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 8వ తేదీ (శనివారం) ఇంటర్మీడియెట్ పరీక్షలు లేని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కర్నూలు టౌన్ ఈఈ శేషాద్రి, డీ-2 డీఈఈ చంద్రమోహన్, డీ1 డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తుండటం వల్ల ఆయా ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జొహరాపురం, జమ్మిచెట్టు, గడ్డ స్ట్రీట్, బెకార్‌గడ్డ, సితార్ గేరి, కృష్ణనగర్, ఆదిత్య నగర్, తారాకరామనగర్, విటల్ నగర్, కల్లూరు, పాత ఎంఆర్‌ఓ ఆఫీసు, టెలికాంనగర్, గుత్తి పెట్రోల్ బంక్, శరీన్ నగర్, జొహరాపురం రోడ్డు, లక్ష్మిటౌన్‌షిప్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం కాలనీ, గణేష్‌నగర్, చిదరంబరరావు నగర్, మున్సిప్ కోర్టు ఏరియా, ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఏరియా, రివర్‌వ్యూ కాలనీ, స్వామిరెడ్డినగర్, ఆటోనగర్, విష్ణు టౌన్‌షిప్, అష్టలక్ష్మి టెంపుల్ ఏరియా, టీజీవీ కాలనీ, వెంకయ్యనగర్, నాగేంద్రనగర్, కోడుమూరు రోడ్ ఏరియా, రామలింగేశ్వనగర్, వెంకటరమణ కాలనీ, స్టాంటన్‌పురం, బాలాజీనగర్, అమీన్ అబ్బాసనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పదోన్నతులకు 11న కౌన్సెలింగ్

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించేందుకు ఈ నెల 11వ తేదీన ఎంపీహెచ్ఈఓ, పీహెచ్ఎన్(టీ)లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ కె.పద్మావతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రం మొత్తంగా 56 మంది జాబితాతో ప్యానల్‌ను విడుదల చేశారు. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన 12 మంది ఎంపీహెచ్ఈఓ, పీహెచ్ఎన్‌లు ఉన్నారు. వీరికి ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాల్లో జూమ్ యాప్ ద్వారా నిర్వహించే పదోన్నతి కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బడ్జెట్‌లో అన్యాయంపై 10న నిరసనలు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కర్నూలు జిల్లాకు జరిగిన అన్యాయంపై మార్చి 10వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పైయ్యావుల కేశవ్ తమ నియోజకవర్గాలకు హంద్రీ నీవా నీళ్లను తీసుకెళ్లడం కోసం అధిక కేటాయింపులు చేసుకున్నారని, అదే సమయంలో కర్నూలు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు పైసా ఇవ్వలేదన్నారు. ముఖ్యంగా గురురాఘవేంద్ర, వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడి కాలువ నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక సర్వేలో కర్నూలు జిల్లా వెనుకబడి ఉందని చెబుతూనే మరో వైపు నిధులు కేటాంచకపోవడంపై జిల్లా ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు చెప్పారు. నాయకులు కె.జగన్నాథం, రామకృష్ణ పాల్గొన్నారు.

డిమాండ్లతో పాటు బాధ్యతలూ ముఖ్యం

కర్నూలు(హాస్పిటల్): ఉద్యోగులకు వారి సమస్యల సాధనలో కోరే డిమాండ్లతో పాటు బాధ్యతలూ ముఖ్యమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఏపీ హంస అసోసియేషన్ ప్రభుత్వ గుర్తింపు పొంది సంవత్సరం పూర్తయిన సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిటీ యూనిట్ ప్రెసిడెంట్ గోవిందు ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలులో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా కేక్ చేయించారు. అసోసియేట్ ప్రెసిడెంట్ మద్దూరు వెంకటస్వామి, సెక్రటరీ చక్రధర్,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

11న చలో విజయవాడ

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 11వ తేదీన చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మునిసిపల్ అవుట్ సోర్సింగ్/కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధిత మునిసిపాలిటీలే జీతాలు చెల్లించాలన్నారు. కనీస వేతనం రూ.36 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకోసం చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా నుంచి వేలాదిగా కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మద్దిలేటి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నారీశక్తి పురస్కారాల ప్రదానం

కర్నూలు కల్చరల్: శ్రీనటరాజ నృత్య కళామందిర్ టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం సి.క్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కళాసౌరభ వారి నారీశక్తి పురస్కారం 2025ను ప్రదానం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ అతిథులుగా హాజరై పురస్కారాలను ప్రదానం చేశారు. సీఐ ఆదిలక్ష్మి, ఎస్ఐ విజయరెడ్డి, ఆర్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీత, సైకాలజిస్ట్ జ్యోతిర్మయి, జ్ఞానేశ్వరి, మల్లేశ్వరి, సరోజ,నాగమల్లేశ్వరి, చంద్రమౌళిని తదితరులకు పురస్కారాలను అందజేశారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో ఏప్రిల్ 12, 13, 14 తేదీల్లో జరిగే సీఐటీయూ వర్క్ షాపును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం సుర్జీత్ భవన్‌లో ఓల్డ్‌సిటీ సీఐటీయూ సమావేశం నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన గౌస్‌దేశాయ్, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయరామాంజనేయులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై దుర్మార్గమైన వైఖరితో ఉన్నాయన్నారు. కార్మికులను వేధించేందుకు నూతన మోటార్ వాహన చట్టం, లేబర్ చట్టాల స్థానంలో లేబర్ కోడ్‌లను తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు అన్యాయం చేసే జీఓలు 21, 31లను వెంటనే రద్దు చేయాలన్నారు. నాయకులు రామకృష్ణ, మైమూద్, సోలమన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.